ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

- నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

నగరంలో ఈద్గాను పరిశీలిస్తున్న ఈద్గాను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్/ శక్కర్‌నగర్, మార్చి 30 : రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో, సంతోషంగా జరుపుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. రంజాన్ నేపథ్యంలో నగరంలోని పలు ఈద్గాలు, మసీదులను ఆదివారం పరిశీలించారు. ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఈద్గా వద్ద మతపెద్దలతో మాట్లాడారు. అనంతరం బోధన్ పట్టణంలోని నర్సిరోడ్‌లోని ఈద్గాతోపాటు పలు మసీదులను పరిశీలించారు. ఈద్గాలు, మసీదుల వద్ద చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. 450 మంది పోలీస్‌సిబ్బందితో బందోబస్తు చేపట్టనున్నట్లు సీపీ వెల్లడించారు. సీపీ వెంట ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

నిరుపయోగంగా కేజీబీవీ గేట్

నిరుపయోగంగా మారిన కొత్తగా ఏర్పాటు చేసిన గేటు

రుద్రూర్, మార్చి 30 : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పక్కన ఉన్న స్థలంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను నూతనంగా నిర్మించారు. విద్యార్థుల సౌకర్యార్థం కేజీబీవీ చుట్టూ ప్రహరీ, గేట్ నిర్మించారు. కానీ గేట్ ద్వారా రాకపోకలు లేక నిరుపయోగంగా మారింది. పాఠశాల ప్రారంభంలో కేజీబీవీకి వెళ్లేందుకు తాత్కాలికంగా బాలుర పాఠశాల ప్రహరీ కూల్చి దారి ఏర్పాటుచేశారు. అనంతరం గేటు ఏర్పాటు చేసినా దాని గుండా రాకపోకలు సాగించడం లేదు. రెండో శనివారం, ఆదివారాలతోపాటు ఇతర రోజుల్లో కేజీబీవీలో ఉండే విద్యార్థినులకు కలిసేందుకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బాలుర పాఠశాల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొని, బాలుర పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. కేజీబీవీకి గేటు ద్వారా వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రహరీని ధ్వంసం చేసి కేజీబీవీకి వెళ్లేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారి

గేటు మూశారు.. పనులు మరిచారు

- ఈ నెల 6న రైల్వే గేటును మూసివేసిన అధికారులు
- ప్రారంభం కాని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు

నవీపేట, మార్చి 30 : రైల్వే గేటు మూసివేసి 24 రోజులు గడుస్తున్నా పనులు ప్రారంభం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం నవీపేట మండలంలోని ధర్మారం, మహంతం ధర్యాపూర్ రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ (రైల్వే అండర్ బ్రిడ్జి)లను మంజూరు చేసింది. రైల్వే మార్గంలో పూర్తి సర్వేలు చేపట్టి అవసరం ఉన్న చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలను మంజూరు చేసింది.

మూసి ఉన్న ధర్మారం రైల్వే గేటు

ఈనెల 6న ధర్మారం, మహంతం రైల్వే గేట్లను మూసి ఆ మార్గంలో వెళ్లే వాహనాదారులు ప్రత్యామ్నాయ మార్గాల నుంచి గమ్య స్థానాలకు చేరుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. కానీ బ్రిడ్జి నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ధర్మారం మహంతం రైల్వే గేట్లను మూసివేసి 22 రోజుల దాటినా.. ఆ ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 31న ధర్యాపూర్ రైల్వే గేటును మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. కాగా ఈ ప్రాంతంలో వారం రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం కావడంతో రైల్వే గేట్ల మూసి వేతతో ఆయా గ్రామాల రైతులు నానా తంటాలు పడుతున్నారు. వరి కోతలు పూర్తయిన తర్వాతే రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. గేట్లను రోజుల తరబడి మూసి ఉంచడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ఎనిమిది నెలలు ప్రజలకు ఇబ్బందులే..

మండలంలోని ధర్మారం, మహంతం రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీ బ్రిడ్జిల నిర్మాణాలతో ఆయా గ్రామాల ప్రజలు ఎనిమిది నెలల పాటు నరకం అనుభవించాల్సిందే. ధర్మారం గ్రామస్తులు రోడ్డు మార్గాన అబ్బాపూర్(ఎం) వరకు వచ్చి నిజామాబాద్ వెళ్తుంటారు. అబ్బాపూర్(ఎం) రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ధర్మారం వైపు వస్తుంటారు. మహంతం గ్రామస్తులు నిజామాబాద్‌కు వయా ఆభంగపట్నం వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ రెండు గేట్లను ఆర్‌యూబీ నిర్మాణాల కోసం 22 రోజులు క్రితం మూసివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. త్వరలో ధర్యాపూర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు సైతం ప్రారంభం కానున్నాయి.

త్వరలో పనులు చేపడతాం..

ధర్మారం, మహంతం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఈనెల 6న రెండు గేట్లను మూసి వేశాం. రోడ్డు మార్గంలో వివిధ కేబుల్స్ ఉండడంతో వాటిని తీసివేసే క్రమంలో పనుల్లో కొంత జాప్యం ఏర్పడింది. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సాధ్యమైనంత త్వరతో పనులు చేయిస్తాం. మండల కేంద్రంలో ధర్యాపూర్ రైల్వే గేటును ఈనెల 31 తేదీన మూసి వేసి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులను ప్రారంభిస్తాం. నిర్ణీత సమయంలో పూర్తి చేయించేందుకు ప్రణాళికను సిద్ధం చేశాం.

– పి.రవి ప్రకాశ్, ఆర్‌వోబీ సీనియర్ సెక్షన్ ఇంజినీర్– హైదరాబాద్

అడ్డుతొలగించుకొనేందుకే భర్తను హత్య చేయించిన భార్య

- రోడ్డుపై పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- భార్య, మరో ఇద్దరి అరెస్టు, రిమాండ్
- విఠల్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్‌హెచ్‌వో అశోక్

వివరాలను వెల్లడిస్తున్న బాన్సువాడ పట్టణ ఎస్ఎచ్‌వో అశోక్

బాన్సువాడ, మార్చి 30: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్ (34)ను అతడి భార్య, అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి హత్య చేయించింది. భర్తను అడ్డుతొలగించేందుకే భార్య ఈ ఘాతుకానికి పాల్పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను బాన్సువాడలోని పట్టణ ఎస్‌హెచ్‌వో అశోక్ ఆదివారం వెల్లడించారు. సోమేశ్వర్ గ్రామానికి చెందిన అమృతం విఠల్ 20 ఏండ్ల క్రితం నాగారం గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. అదే గ్రామానికి చెందిన అమృతం కాశమణికి ఇచ్చి వివాహం చేశారు. అమృతం విఠల్‌కు గతంలో దవాఖానలో పరీక్షలు చేయగా.. హెచ్ఐవీ ఉన్నదని తేలింది. దీంతో ఐదేండ్లుగా కాశమణి అతడికి దూరంగా ఉంటున్నది. ఈ విషయంలో పలుమార్లు పంచాయితీలు కూడా నిర్వహించారు. ఈక్రమంలో నాగారం గ్రామానికి చెందిన విఠల్‌తో కాశమణికి పరిచయం ఏర్పడింది. తనకు అమృతం విఠల్‌తో ఉండడం ఇష్టం లేదని, తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆమె అతడితో తెలిపింది. అతడి అడ్డు తొలగించాలని కోరింది. అందుకు డబ్బులు ఇస్తానని తెలిపింది. దుకాణంలో బంగారం తనాఖా పెట్టి రూ.18వేలు ఇచ్చింది. ఈనెల 29న అమృతం విఠల్ ఇంటి నుంచి బయల్దేరాడు. సాయంత్రం పుల్కంటి విఠల్ ద్విచక్ర వాహనంపై కాశమణి భర్తను కల్లు తాగేందుకు దుర్కికి తీసుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో హత్యచేసి, మృతదేహన్ని బీర్కూర్ – బాన్సువాడ మెయిన్ రోడ్డుపై పడేసినట్లు ఎస్‌హెచ్‌వో అశోక్ తెలిపారు. పక్కా సమాచారంతో నిందితులు కాశమణి, పుల్కంటి విఠల్, అమృతం విఠల్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

పాస్టర్ ప్రవీణ్‌కు ఘననివాళి

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ సీఎస్ఐ చర్చి వద్ద ఆదివారం నివాళులర్పించారు. తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

–కంఠేశ్వర్, మార్చి 30

వరి పంటకు సాగునీటి కష్టాలు

కొందాపూర్ శివారులో నీరు అందక ఎండుతున్న వరి పంట

రుద్రూర్, మార్చి 30 : యాసంగి సీజన్‌లో చేతికి వచ్చే వరి పంటలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. దీంతో పంట చేతికి వస్తుందో రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రుద్రూర్‌లోని పంటలకు ప్రతి ఏటా నిజాంసాగర్ నీళ్లు పుష్కలంగా ఉండి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేది. ప్రస్తుతం నిజాంసాగర్ నీళ్లు వస్తున్నప్పటికీ సరిపడా అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పంటలకు సాగు నీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

బాలుడి హత్య కేసులో కీలక ఆధారాలు లభ్యం

- నిందితులు మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తింపు
- రైల్వేస్టేషన్ నుంచి ఎత్తుకెళ్లి హత్య చేసిన వైనం
- సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం

వినాయక్‌నగర్, మార్చి 30 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ ఏరియాలో 14 నెలల బాలుడు కైలాస్ తలపై కొట్టి దారుణంగా హత్యచేసిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం మహారాష్ట్రకు చెందిన కమల తన పిల్లలతో కలిసి నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తుండగా కైలాస్‌ను తల్లి పక్క నుంచి ఎవరో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. సదరు బాలుడు ఈనెల 28న మధ్యాహ్నం సమయంలో నగరంలోని కంఠేశ్వర్‌లోని ఉమెన్స్ కళాశాల పక్కన శవమై తేలాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి కేసు నమోదు చేసి, బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసినట్లు గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. ఓ కీలకమైన ఆధారం పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. కైలాస్‌ను మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఇద్దరు (ఆడ,మగ) కలిసి అర్ధరాత్రి సమయంలో రైల్వేస్టేషన్ నుంచి ఎత్తుకెళ్లారు. అనంతరం బాలుడిని కంఠేశ్వర్ ప్రాంతంలో హత్య చేసి పడేశారు. ఈ కేసును ఛేదించేందుకు ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న దృశ్యాలను కంఠేశ్వర్ ఏరియాలోని సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. నిందితుల ఆనవాళ్లు బట్టి వారు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించిన పోలీసులు.. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు మహారాష్ట్రకు వెళ్లినట్లు సమాచారం.

సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుల చిత్రాలు

రాబడి

ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

తపాలా శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం–1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్‌సీ)

ఎన్ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపులుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.

గోల్డ్ Vs నిఫ్టీ50

దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి–మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

ఇదీ సంగతి..

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

దీర్ఘకాల రాబడులు

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8–10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12–15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

ద్రవ్యోల్బణం సవాళ్లు

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

ఒడిదుడుకులు

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

ద్రవ్య లభ్యత

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

పోర్ట్‌ఫోలియో

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

చివరగా..

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!



దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800–24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి



నేడు వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె–కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.